# తోట్లూరు నాగేశ్వరరావు ఆధునిక నీతికథలు

సాయంత్రం ఆఫీసునుంచి నేరుగా రూమ్‌కు వచ్చాడు మల్లిక్. ఆరు నిముషాల తక్కువ ఆరుగంటలైంది. ఆఫీసునుంచి అతను నేరుగా రూమ్‌కు రావడం బహు అరుదు. ఫ్రెండ్స్‌తో కలిసి సినిమాకెళ్ళడమో, షికారుకెళ్ళడమో, మందు పార్టీలో మార్పోవడమో, చీట్లపేక ఆడటమో- ఏదో ఒకటి చేయడం నెలలో ఇరవైతొమ్మిది రోజులు అలవాటు. ఏంతోచక, కలియుగ బుద్ధిమంతునిలా ఎప్పుడైనా సూటిగా రూమ్‌కెళ్ళితే ఏదో ఒక సంఘటన జరక్కుండా పోదు. అలాగని అనుకొంటూనే మల్లిక్ ఒంటిస్తంభం రూమ్ తలుపు తెరిచాడు.

ఎదురుగ్గా మడిచిన ఓ తెల్లకాగితం అతని దృష్టిలో పడింది. అందులో-

'సాయంత్రం ఆరున్నరకు టాంక్‌బండ్ మీద కల్సుకోండి. వివరాలు ముఖాముఖీ.

మీ

అంబిక.

మల్లిక్ మనస్సు ప్రమోదంతో ఉత్తుంగతరంగమైంది. ఇక షర్ట్ డ్రస్సు మీద ఈగ వాలనీయకుండా ఆపళంగా మొహం కడుక్కొని, ఆ మొహంమీద యింత టాల్కంపౌడరు వేసుకొని, ఆ పైన 'యు అండ్ మి' స్ప్రే చల్లుకొని, అయిదు నిముషాల్లో టిప్‌టాప్‌గా తయారై- ఆటో ఎక్కాడు రూమ్ తలుపులు తాళం వేసిందీ లేనిదీ జ్ఞాపకంలేకుండా.

అంబిక ఆర్.టి.సీలో స్టెనో. అద్భుతమైన అందాల రాశి.

మూడేళ్ళనుంచీ ఆమెను మహా యిదిగా ప్రేమిస్తున్నాడు.

ఆమె పెళ్ళికి ఒప్పుకొంటే దారం తెగిన గాలిపటంలాంటి తన బ్రతుక్కి స్థిరమైన, శాశ్వతమైన ఆసరా దొరుకుతుందనీ, 'గృహమే కదా స్వర్గసీమ' అన్న ఆశయానికి ఆచరణ సాధ్యత లభిస్తుందనీ ఆశిస్తూ వచ్చాడు.

ఆమె కిష్టమే. తనంత గాఢంగా కాకపోయినా మొత్తంమీద తనని ఆమె ప్రేమిస్తోంది. తమ పెళ్ళికి రిటైర్ అయిన డిప్యూటీ తాశీల్దారు ఆమె తండ్రి

అడ్డుగోడగా నిలుస్తూ వచ్చారు! ఇప్పటికైనా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారో, లేదో! కులం ఒక్కటే. తనకి పన్నెండొందల రూపాయల వుద్యోగముంది. ఇద్దరం పెళ్లిచేసుకొంటే సంసారం నిమ్మకాయ రసంలో తేనె కలిపినట్టు పసందుగా నడిచిపోతుంది....

ఆరూ ఇరవైకి మల్లిక్ టాంక్‌బండ్ మీద ఆటో దిగాడు. ఆటోవాడికి డబ్బులిస్తూ హుసేన్‌సాగర్ పేవ్‌మెంట్ మీద కలియచూశాడు- అంబిక కోసం. ఆమె ఇంకా రాలేదు. పదినిముషాలపాటు టాంక్‌బండ్ మీద లైట్లనీ, తిరిగే జనాన్నీ, వాహనాల్నీ, దూరంగా 'ల్యాండ్' అయ్యే విమానాల్నీ చూస్తూ కాలక్షేపం చేశాడు.

సరీగ్గా ఆరున్నరకు అంబిక వచ్చింది. ఆమె మొహంలో వెన్నెల్ని చూసి, పెళ్లికి 'గ్రీన్ సిగ్నల్' అయినట్టు సంతోషం సగం బలంగా పన్నెండు కిలోలు ఉబ్బిపోయాడు మల్లిక్.

కలకత్తా కాటన్‌చీరలో అంబిక అపరూప లావణ్యరాశిగా కనబడింది. ముసిముసి నవ్వులతో సిగ్గుల్ని విరజిమ్ముతూ, "ఎంతసేపైంది వొచ్చి" అంది.

"నా కళ్లు చూస్తే తెలీయడంలేదూ!- ఎంతసేపట్నుంచి నిరీక్షిస్తున్నానో!" అన్నాడు మల్లిక్ కొంటెగా.

"ఇకమీదట ఈ నిరీక్షణలు వుండవులెండి!"

"అంటే-?"

"మా ఫాదర్ పెళ్లికి ఒప్పుకున్నాడు."

అమాంతంగా ఆమెను కౌగలించుకొని అర్థమీటరు పైకెత్తి, ముద్దులతో ముంచెత్తాలన్నంత ఉద్వేగపూరితమైన సంతోషం కలిగింది మల్లిక్‌కు. కాని అది పబ్లిక్‌ప్లేస్ అయిపోయింది. ఆ సంబరానికి కళ్లేలు బిగించి, దగ్గరున్న రాతి సోఫామీద కూర్చోబెట్టి, అరగంటసేపు మహదానందంతో ఆ కబురూ ఈ కబురూ చెప్పాడు. తమ వైవాహిక జీవితంలోని మాధుర్యాన్ని రంగుల బొమ్మ వేసినట్టు చూపెట్టాడు.

చీకటి చిక్కబడింది.

విద్యుత్‌దీపాలు పౌరుషాన్ని పెంచుకున్నాయి.

"పొద్దుపోతోంది. వస్తాను" అంది అంబిక చివుక్కున లేస్తూ.

"అప్పుడేనా! ఓ ముద్దిచ్చి...." అన్నాడు మల్లిక్ చిలిపిగా.

"అమ్మో! ఇది కొలంబో అనుకున్నారా, క్యాలిఫోర్నియా అనుకున్నారా! నలుగురూ చూస్తే నగ్నంగా నవ్విపోరూ!...." అంటూ బస్‌స్టాప్‌కు వెళ్లింది అంబిక కళ్లతో 'టాటా' చెబుతూ.

మల్లిక్ మనస్సు తెల్లమబ్బుల మధ్య ఎయిర్‌బస్ పోతోన్నంత కులాసాతో వూగిసలాడింది.

సిటీబస్సు ఎక్కిపోయింది అంబిక.

ఆటో ఎక్కాడు మల్లిక్. ప్యాంట్ జేబులో చేయిపెట్టి చూసుకున్నాడు— పదహేను రూపాయల ముప్పావలా వుంది. తాను గాఢాతిగాఢంగా ప్రేమిస్తోన్న అంబికతో పెళ్లి వార్త విన్న శుభసందర్భంలో ఓ చుక్క వేసుకోవాలన్న కోర్కె అతనిలో కోడెత్రాచులా బుసపెట్టింది. వెంటనే హిమాయత్‌నగర్‌లో ఓ చిన్న బార్ ముందు ఆటోను ఆపాడు. ఆ బార్‌లోకి దూరాడు, ఆటోకు రెండు రూపాయలిచ్చి.

చవుక బారు బ్రాందీ ఓ పెగ్‌కు ఆర్డరిచ్చాడు. సోడా అక్కర్లేదన్నాడు. ఓ ప్లేట్ చిప్స్ పట్టుకురమ్మన్నాడు. ఉగాది పండక్కు ముందు తయారుచేసినట్లున్నాయి ఆ చిప్స్, దుర్వాసన. వెలిసిపోయిన రంగు. నోట్లో పెట్టుకోగానే తెమలినట్లయింది. బ్రాందీ కూడా బావుంతలేదు. కిర్సనాయిలో, గుడుంబాయో, కాపుసారాయో కల్తీ కల్పినట్లుంది. అయినా అంబికతో పెళ్లి కాబోతోన్న ఆనందంలో, స్కాచ్ తాగుతూన్న వూహతో రెండున్నర పెగ్గులు తాగి పధ్నాలుగు రూపాయల పావలా చెల్లించి రోడ్డుమీద పడ్డాడు మల్లిక్.

రాత్రి ఎనిమిదిన్నర దాటింది.

అరకిలోమీటరు దూరం నడుచుకుంటూ రూమ్‌కు చేరాడు. రూమ్ తలుపులు తెరిచే వున్నాయి. ఆ తలుపుల్ని అతను సాయంత్రంపూట మూయటం మర్చిపోయాడు.

లోపలికెళ్లి మంచంమీద అడ్డంగా పడ్డాడు మల్లిక్.

గంట గడిచింది.

నిద్రరాదు. కడుపులో తుప్పుకత్తులతో ఏదో కెలుకుతున్నట్టు ఫీలింగ్.

రెండుసార్లు వాంతులు చేసుకున్నాడు— పెద్దగా శబ్దంచేస్తూ.

వొంటినిండా చెమట. తలబ్రద్దలయ్యే నొప్పి.

ఇంటి యజమాని కిందనుంచి పైకి వచ్చాడు.

మల్లిక్ పరిస్థితి చూడగా ఆయనకు భయమేసింది. వెంటనే రిక్షా పిలిపించి దగ్గరున్న నర్సింగ్‌హోమ్‌లో చేర్పించాడు మల్లిక్‌ను.

బ్రాందీలో కల్తీవల్ల ఆ ప్రమాదం ఏర్పడిందని డాక్టరు చెప్పాడు.

మరునాడు సాయంత్రానిగ్గానీ మల్లిక్ నర్సింగ్‌హోమ్‌నుంచి బయట పడలేదు. అతని ఇంటి యజమానే నూటముప్పైరూపాయల బిల్లు చెల్లించి, మల్లిక్‌ను ఇంటికి తీసుకొచ్చాడు.

*మనసులు కలిస్తే ప్రమోదం; కాని మందులో కల్తీ కలిస్తే ప్రమాదం.*